మా ఊరు బాగుపడిందోచ్..

- మారిన కొర్లాం రూపురేఖలు
- సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాల ఏర్పాటు
- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- రూ. 1.10 కోట్లతో అభివృద్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఆధునిక హంగులతో కొర్లాం గ్రామ సచివాలయ భవనం

గంట్యాడ: ఎక్కడో మూలకు విసిరేసినట్లు ఉండే తమ గ్రామం బాగుపడిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి జరగని అభివృద్ధి కేవలం నాలుగున్నరేళ్లలో జరగడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొర్లాం గ్రామం రూపురేఖలు మారిపో యాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారు. ఇంతలా అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదని గ్రామస్తులు చెబుతుండడం విశేషం. జిల్లా కేంద్రం, మండల కేంద్రంలో జరగాల్సిన పనులు కూడా గ్రామ స్థాయిలో అందించేవిధంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంపై అభినందనలు వెల్లువెత్తుతు న్నాయి. గ్రామ సచివాలయంలో 550 రకాలకు పైగా సేవలు అందుతున్నాయి. కొర్లాం రాజకీయ చైతన్యం కలిగిన గ్రామం కావడంతో జిల్లాలో ఏ కార్యక్రమం చేపట్టినా ముందుగా ఈ ఊరు నుంచే చేపడుతుంటారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కూడా 2004లో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ఈ గ్రామంలోనే ప్రారంభించారు. ప్రస్తుతం ఈ గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది.


ప్రధాన వీధిలో వేసిన సీసీ రోడ్డు

రూ.1.10 కోట్ల అభివృద్ధి పనులు..

గ్రామంలో కోట్లాది రుపాయలు వెచ్చించి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టింది. గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం భవనాలతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. రూ. 40 లక్షలతో సచివాలయ భవనం, రూ. 21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే)భవనం, రూ. 18 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నిర్మించారు. అలాగే మరో 30 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారు.

అదృష్టంగా భావిస్తున్నా..



ప్రజలకు సేవ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. లక్షలాది రూపాయలతో భవనాలు నిర్మించాం. అలాగే రహదారులు, డ్రైనేజీలు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పెద్దల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తా.

– చప్పు వెంకటరమణమ్మ, సర్పంచ్, కొర్లాం గ్రామం

అందుబాటులోకి సేవలు

సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ గ్రామంలో ఏర్పాటు చేయడంతో ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ఒక్క సచివాలయంలోనే 550 రకాలకు పైగా సేవలు అందిస్తున్నారు. గతంలో ఇవే పనులకు జిల్లా కేంద్రానికి , మండల కేంద్రానికి వెళ్లేవారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్ని గ్రామాల్లోనే అందిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

స్థానికంగానే సేవలు



గతంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలకు మండల కేంద్రాలకు పరుగులు తీసేవారం. అలాగే ఏదైనా జబ్బు చేస్తే పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన పరిస్థితులుండేవి. విత్తనాలు, ఎరువులకు ఎన్నో అవస్థలు పడ్డాం. ప్రస్తుతం అన్ని రకాల సేవలూ గ్రామంలోనే అందుతుండడంతో ఇబ్బందులు తగ్గాయి.

– కొరుపోలు అప్పలనాయుడు, కొర్లాం గ్రామం



రైతుభరోసా కేంద్రం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్

క్లుప్తంగా

పరామర్శ


ముత్యాలనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: గజపతినగరం మార్కెట్ కమిటీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు సోదరుడు వేమలి అప్పారావు నాయుడు కొద్దిరోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందారు. మండలంలోని కొత్తారుబిల్లి గ్రామంలోని ఆయన ఇంటికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ డైరెక్టర్ పి. నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

రూ.20 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్


రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టమ్

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం రైల్వేస్టేషన్ రహదారి నుంచి చంపావ తి వంతెన వరకు రోడ్డు మధ్య డివైడర్‌లో రూ.20 లక్షలతో లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. పంచాయతీ, విద్యుత్ శాఖ నిధులతో ఈ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కిషోర్‌కుమార్ శనివారం తెలిపారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుపై పట్టణ ప్రజలు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం గ్రామంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభంకానున్న ఈ కార్యక్రమంలో అన్నిశాఖల ఆధ్వర్యంలో అమలు చేసిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వెలమలను బీసీ -ఏలోకి మార్చాలి

వేపాడ: ఉత్తరాంధ్రలో వెలమ సామాజిక వర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జనాభా ధామాషా ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ టిక్కెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెలమల హక్కుల సాధన కోసం ఈనెల 30వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో నిర్వహించే ప్రజాచైతన్యయాత్రను వెలమ సామాజిక వర్గమంతా విజయవంతం చేయాలని కోరారు.

సంక్రాంతి సంబరాలు


భోగిమంట వేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, నాయకులు

జామి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను తహసీల్దార్ జి.హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది సాంప్రదాయ దుస్తులు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలో సిబ్బంది వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఉద్యోగులంతా కలిసి భోగి మంట వేశారు. సంబరాలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు అతిథులుగా హాజరయ్యారు.

వివేకానంద జీవిత చరిత్ర తెలుసుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లి: స్వామి వివేకానంద జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకుని, ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు, యువతకు శనివారం వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద రచించిన పుస్తకాలను విద్యార్థులు, యువత తప్పనిసరిగా చదవాలన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పిన గొప్ప మహనీయుడు వివేకానంద అని అన్నారు. అనంతరం వివేకానంద సందేశాత్మక పుస్తకాలను పంపిణీ చేశారు.

ముగిసిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు


విజేత, రన్నర్‌గా నిలిచిన జట్లకు బహుమతులు ప్రధానం చేస్తున్న రమణరాజు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురంలో లుక్‌ఫర్ ఫ్యూచర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. 22 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో బుధరాయవలస, గాతాడ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.

బుధరాయవలస జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.12 వేల నగదు బహుమతి, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన గాతాడ జట్టుకు రూ.8 వేల నగదు బహుమతి అందజేశారు. బహుమతుల ప్రదానంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు ఎస్.రామరాజు, ఎస్.వెంకటనారాయణరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, అడ్డాల కృష్ణమూర్తిరాజు, ఎస్.రమణరాజు, ఎస్.రామ్మూర్తిరాజు, ఎస్.సీతారామరాజు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ


బొండపల్లి: కనిమెరకలో అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు

బొండపల్లి: అయోధ్య రామజన్మభూమి నుంచి తీసుకువచ్చిన అక్షతలను మండలంలోని కనిమెరకలో ఆగ్రామ భజనమండలి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకుముందు అక్షతలను గ్రామంలో ఊరేగించారు. ఈనెల 22న అయోధ్య రామాలయంలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్న నేపథ్యంలో అక్షతలు, అయోధ్య రామమందిర చిత్రంతో పాటు, ఆలయ వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు.

వంగపల్లిపేటలో..

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేట గ్రామంలో అయోధ్య అక్షతలను శనివారం పంపిణీ చేశారు. గ్రామపెద్దలు,రామ భక్తులంతా కలిసి అక్షతలను ఊరేగిస్తూ ఇంటింటికీ వాటిని అందజేశారు.


చీపురుపల్లిరూరల్: వంగపల్లిపేటలో అక్షతలను ఊరేగిస్తున్న పెద్దలు, రామ భక్తులు

రైతు బజారుకు సెలవు లేదు

శృంగవరపుకోట:

స్థానిక రైతుబజార్‌కు ఆదివారం సెలవు లేదని ఎస్టేట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ చెప్పారు. సంక్రాంతి పండగ సందర్భంగా వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం జిల్లా వ్యాప్తంగా రైతు బజార్లు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు.ఈ మేరకు పట్టణంలో రైతు బజార్‌ను ఆదివారం తెరవనున్నట్లు వివరించారు. రైతులు యథావిధిగా కూరగాయల అమ్మకాలు చేసి సహకరించాలని, వినియోగదారులు రైతుబజార్ సేవలు వినియోగించుకోవాలని కోరారు.

కిటకిటలాడిన వారపు సంత


దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో కిటకిటలాడుతున్న పొట్టేళ్ల సంత

దత్తిరాజేరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో పెదమానాపురం వారపు సంత వ్యాపారస్తులు, కొనుగోలుదారులతో శనివారం కిటకిటలాడింది. సంతకు వచ్చిన వారు కుండలు, దుస్తులు, పూజా సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పొట్టేళ్లు, కోళ్లకు మంచి గిరాకీ పలికింది.

మార్కెట్‌లో సందడి

చీపురుపల్లి: సంక్రాతి పండగ సందర్భంగా పట్టణంలోని మార్కెట్‌లో ఆదివారం సందడి నెలకొంది. దుస్తులు నుంచి కిరాణా సామగ్రి, పెద్దలకు చూపించే పంచెలు, చీరలు కొనుగోలుకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చీపురుపల్లి ప్రధాన మార్కెట్ కావడంతో కొనుగోలుదారులు తాకిడి పెరిగింది. పెద్ద దుకాణాలతో పాటు ఫుట్‌పాత్ వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి.


చీపురుపల్లి మెయిన్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌పై పంచెలు, చీరలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పాతవారికే మళ్లీమళ్లీ కండువాలు

మెరకముడిదాం: తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజల్లో భ్రమలు కల్పించేందుకు నానా తిప్పలు పడుతున్నారు. తమ పార్టీవారు, తటస్థులకు మళ్లీమళ్లీ పార్టీ కండువాలు వేస్తున్నారు. మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురం గ్రామానికి చెందిన శిరువూరు వాసుదేవరాజు, శిరువూరువెంకటపతిరాజు, తదితరులు టీడీపీకి చెందిన వారే. రెండేళ్ల కిందట వారు బలపర్చిన అభ్యర్థి సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు లభించక ఇన్నాళ్లూ తటస్థంగా ఉన్నారు. వారినే ఇప్పుడు కొత్తగా పార్టీలో చేరుతున్నట్టు టీడీపీ కండువాలు వేసి నాయకులు హంగామా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేశా..

- మరోసారి అవకాశం ఇస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించండి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


కుళాయిలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించడం ద్వారా కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక దృష్టి సారించి వారి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. మరోసారి అవకాశం ఇస్తే యవతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు తనకు చివరవని విజయనగరం నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. నగరంలోని 30, 31 డివిజన్లకు సంబంధించి పద్మావతినగర్ సమీపంలోని వసంత విహార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్లకు అపార్ట్‌మెంట్ వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, వసంతవిహార్ ఏర్పాటై దాదాపు 15 ఏళ్లు కావొస్తున్నా, ఈ ప్రాంతంలో కనీస అవసరాలు ఏర్పాటు కాలేదన్నారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత ప్రజలకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్త ధర్మపురిలో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి ప్రత్యేక పైపులైన్ల ద్వారా కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మరోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైతే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి చర్యలు


వనమిత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ రాహుల్ పాండ్యా

బొండపల్లి: వన మిత్ర కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) రాహుల్ పాండ్యా తెలిపారు. స్థానిక వనమిత్ర కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. మొక్కల పెంకంతో పాటు, కేంద్రంలో ఇతర సదు పాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వనమిత్ర కేంద్రాల్లో రైతులకు అవసరమైన మొక్కలను పెంచి, వాటిని పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. అలాగే తాటిపూడి రిజర్వాయర్‌లో పర్యాటకులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బేతనాపల్లి వద్ద అన్ని హంగులతో ఓ పార్కును ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్, ఎఫ్ఆర్‌ఓ జె.సింధూ, ఎఫ్ఎస్ఓ ఎస్.డి.ప్రసాద్ అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



లక్కవరపుకోట: మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఆర్.గోపాలరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం వన్‌టౌన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ ముకుందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు.

చీపురుపల్లి ఎస్ఐగా కిరణ్‌కుమార్



చీపురుపల్లి: పట్టణ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్ఐ)గా కె.కిరణ్‌కుమార్‌నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గంట్యాడ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసి ఏ.సన్యాసినాయుడును వేకెన్సీ రిజర్వుడ్‌కు బదిలీ చేశారు.

బుధరాయవలస ఎస్ఐగా లోకేశ్వరరావు



మెరకముడిదాం: బుధరావయలస ఎస్ఐగా బి.లోకేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజాం నియోజకవర్గం సంతకవిటి నుంచి బదిలీపై వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన సీహెచ్.నవీన్ పడాల్ విజయనగరం క్రైమ్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

గంట్యాడ ఎస్ఐగా సురేంద్రనాయుడు



గంట్యాడ: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి.సురేంద్రనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామభద్రాపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చా రు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడుకు చీపురుపల్లికి బదిలీ అయింది.

గజపతినగరం ఎస్ఐగా మహేష్



గజపతినగరం: మండల ఎస్ఐగా యు.మహేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డెంకాడ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన సీహెచ్.గంగరాజు ఎస్.కోట మండలానికి బదిలీ అయ్యారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


గుర్ల: చింతలపేటలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

గుర్ల:

మండలంలోని చింతలపేట గ్రామంలో సర్పంచ్ పతివాడ భాస్కరరావు, ఎంపీటీసీ జమ్ము అప్పలనాయుడు శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వీధి కాలువల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. దోమల నివారణకు కాలువల్లో బ్లీచింగ్ చల్లారు.


బొండపల్లి: అంబటివలసలో కాలువల్లో బ్లీచింగ్ ద్రావణం పిచికారీ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

అంబటివలసలో...

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం తొలగించడంతో పాటు బ్లీచింగ్ ద్రావణం పిచికారీ చేశారు. పనులను ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు,వైఎస్సార్‌సీపీ నాయకుడు రౌతు చిన్న పర్యవేక్షించారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై నిఘా

గజపతినగరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి పందేలు, పేకాట శిబిరాలపై నిఘా ఉంచామని గజపతినగరం సీఐ ఎస్.వి.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.